# ప్రమోషన్

వింధ్యావాసిని

అది 'డీలక్స్ పబ్లిసిటీ ఎసోసియేట్స్' ఆఫీసులో రిసెప్షన్ హాలుని ఆనుకుని కుడి వయిపుగా ఉన్న చిన్న గది. గది మధ్యలో స్టీల్ టేబిల్, కుడివైపు ఆనుకుని ఒక చివరి నుంచి మరో చివర్ని ఆక్రమించిన నాలుగు అల్మైరాలు ఉన్నాయి. టేబిలు ముందు కూచుని పని చేసుకుంటున్నతని వయసు ముప్ఫయి ఉండొచ్చు. గదిలోకి ఎవరయినా ప్రవేశించగానే, అతని పరిచయం చేసే నేమ్ ప్లేట్ ఒకటి టేబుల్ మీద ఎదురొస్తుంది. దాని మీద ఎమ్. సి. రవీంద్ర కుమార్, అసిస్టెంట్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, అని వుంటుంది.

మంచి వేసవి కాలపు మధ్యాన్నం మూడు గంటల సమయం. బాగా ఉక్కగా వుంది. అప్పుడే భోజనంచేసి వచ్చాడు రవీంద్ర. ఫ్యాన్ వేసుకున్నా చల్లగా అన్పించటం లేదు. "కంపెనీ పేరూ పెద్దదే, చెప్పుకోందుకు చేస్తున్న ఉద్యోగం పేరూ పెద్దదే. కానీ ఏం లాభం? పడుతున్న కష్టానికి తగిన సౌకర్యాలు లేక పోయాక" అని లోలోపలే విసుక్కుంటున్నాడు అతగాడు.

తన పై ఆఫీసరు సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఏర్ కూల్డ్ రూము, అక్కడున్న ఫస్ట్ క్లాసు ఫర్నిచర్ తలచుకుంటే మరింత చిరాకేస్తుంది రవీంద్రకి. ఇంతా చేస్తే, బాధ్యత నెత్తినేసుకుని పనిచేసేది తను. పై పైన డాబుగా తిరిగేవాడు అతను, లోపలెంత కచ్చగా ఉన్నాసరే, ఎదురుగా 'ఎస్సర్, ఎస్సర్' అనక తప్పదు. తనకొచ్చే జీతం ఎనిమిదొందలే అయినా, కంపెనీ ప్రెస్టీజికి తగినట్లు సూటు వేసుకు తీరాలి. వేసవి కాలం వచ్చిందంటే, ఎప్పుడాఫీసు నించి బయట పడతానా, ఈ సూట్ విప్పి ఈజీ డ్రస్‌లోకి మారతానా అన్నట్లుంటుంది అతనికి.

పరాగ్గా ఫైల్లో పేజీలు తిప్పుతున్న రవీంద్ర; ఫోన్ మోగేసరికి విసుగ్గా అందుకుని 'హాలో' అన్నాడు. మాట్లాడుతున్నది ఎస్. ఇ. నారాయణరావు.

"హాలో రవీంద్రా, ఇప్పుడే మేనేజర్ గారితో మాట్లాడి వచ్చాను. హి వాంటెడ్ టు సీయు. సాయంత్రం వెళ్ళేలోగా మీట్ అవమన్నారు. బై దిబై, నేను చూడాల్సిన వర్క్ ఏమయినా వుందా?"

"నో సర్—ఎవ్విరి థింగ్ ఈస్ రొటీన్.... నాలుగున్నరకి అయిపోతుంది నా పని. అప్పుడు మేనేజర్ గార్ని మీట్ చేస్తాను.... అన్నట్లు.... 'మధూ లిక్కర్స్' కంపెనీ పేపర్స్ అకౌంట్స్ సెక్షన్‌కి పంపించేదా? మీరేమయినా...."

"ఓహో. నేను ముందే చూసేను. పంపిం చేయి. ఒకే బై, సీయు టుమారో" అన్నాడు. ఫోన్ పెట్టేసిన శబ్దం అయింది.

మేనేజర్ తనతో మాట్లాడాలనుకోవటం కొంత ఆశ్చర్యంగానే ఉంది రవీంద్రకి. అతనీ పోస్ట్‌కి వచ్చి నాలుగేళ్ళయింది. ఈ నాలుగేళ్ళలో నారాయణరావు నెలవులో వెడితే, మూడుసార్లు అఫీషియల్‌గాను, ఏవో కంపెనీ డిన్నర్ పార్టీల్లో అనఫీషియల్‌గా రెండు సార్లు మాత్రమే బిగ్ బాస్‌తో ఎదురుపడి మాట్లాడటం జరిగింది.

అనుకున్న టయిముకి పనముంది. వాష్ బేసిన్‌లో ముఖం కడుక్కుని, తల దువ్వుకుని, టై సరిజూసుకుని, ఛెయిర్ మీదున్న కోటు తొడుక్కుని బయలు దేరాడు రవీంద్ర.

మేనేజర్ గది ముందున్న చిన్న గదిలో ఒకమ్మాయి టైప్ చేస్తోంది. రవీంద్ర రాకను గమనించి, చేస్తున్నపని నాపి అతనికి విష్ చేసింది.

"బాస్ కోసం వచ్చారనుకుంటాను. వారు ఇంటికి వెళ్ళి కాస్సేపయింది. మీరొస్తే ఇంటికి రమ్మన్నారు" అన్నది.

మరింత ఆశ్చర్య పోయాడు రవీంద్ర.

"ఓకే. థాంక్స ఫర్ ది మెసేజ్" అనేసి బయలు దేరాడు.

హెల్మెట్ బిగించి, పది నిమిషాల్లో శివరామ్ కార్నడ్ గారిల్లు చేరాడు. ఏేష్ బంగళా కుండాల్సిన గేట్ వాచరు, గేటు దాటగానే ఎదురయే ఫ్లవర్ గార్డెన్, వరండాలోనే స్వాగతం పలికే అల్సేషియన్ డాగ్ లాంటి లక్షణాలన్నీ వారింటికీ వున్నాయి.

పోర్టికోలో స్కూటరాపి బెల్ నొక్కాడు. తలుపు తీసిన పనికుర్రాడు, మీరు రవీంద్రగారా?" అనడిగి, అవుననగానే శివరామ్‌గారి గదికి దారి చూపించాడు.

వెళ్ళగానే టీకప్ ఆఫర్ చేసిన బిగ్ బాస్ మర్యాదకి తబ్బిబ్బవక తప్పలేదు రవీంద్రకి.

"నీతో ఒకపని చేయించాలని రమ్మన్నానోయ్"

"చెప్పండి సర్" వినయంగా అన్నాడు రవీంద్ర.

"చాలా ఏళ్ళుగా మనకున్న ప్రాస్పెక్టివ్ కస్టమర్స్‌లో "ప్రియా" ప్రెషర్ కుకర్స సంస్థ ఒకటి. వారి స్పెషాలిటి అందరికీ తెలిసిన విషయమే. మన స్టేట్‌లో మొదటగా తయారయిన ప్రెషర్ కుకర్ "ప్రియా". ఇప్పటికీ ఎన్నో ఇతర బ్రాండ్స వచ్చినా, తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నది. ఇంతే కాకుండా వారి స్పేర్ పార్ట్స్‌కి డూప్లికేట్స్‌ని తయారు చేయలేని ప్రత్యేకత ఒకటుంది. అయితే ఈ మధ్య పడాదిగా స్పేర్ పార్ట్స్‌లో ముఖ్యమయిన అంటే ఎక్కువగా సేల్ అవాల్సిన రబ్బర్ గాస్కెట్ అమ్మకం బాగా పడిపోతున్నట్లు తెలుస్తోంది.

"అందుక్కారణం, ఎవరో డూప్లికేట్‌ని తక్కువ ఖర్చుతో తయారు చేయటం, అమ్మటమే అనిపిస్తుంది. ప్రియా" ట్రేడ్ మార్క్‌ని అనధికారంగా ఉపయోగించుకుంటున్న దెవరో తెలిస్తే ప్రాసిక్యూట్ చేయవచ్చు."

"ఇదిలాగే కొనసాగితే, మన కంపెనీ కూడా కొంత నష్టం భరించాల్సిరావచ్చును. అందుకని మనమే దీన్ని ఎన్‌క్వైరీ చేసి చూస్తే, ఆ కంపెనీకి మేలు చేసినట్లవుతుంది"

"ఈ పని నీకు అప్పచెప్పాలనే నిన్ను రమ్మన్నది. ఇది రహస్యంగా జరగాలి. అందుకనే ఇంటికి పిలిచాను."

"ఓకే సర్. నాకొంచెం టయమివ్వండి ప్రయత్నిస్తాను" మెచ్చుకోలుగా చూసారు శివరామ్ గారు.

ఆయన ఆఫీసులో ప్రత్యేకంగా, అందరికీ దూరంగా ఉన్నట్టు కన్పించినా, ఏ మూల



ఏం జరుగుతుందో, ఏ ఫైలు ఎవరి టేబిల్ మీద నిల్చి పోయిందో లాంటివి బాగా తెలుసు. అలాంటి వాడికి రవీంద్ర తెలివి, కార్యదక్షతా తెలియని విషయాలను కోవటం పొరబాటు.

o o o

టాంక్ బండ్ మీద నిలుచుని, వెయిట్ చేస్తోన్న రమ ముఖం వికసించింది, అల్లంత దూరంలో పసుపుపచ్చ స్కూటర్ కన్పించగానే.

స్కూటర్ ఆగగానే, "ఏమిటో ఇంతా లస్యం," అంది.

"పెద్ద సారువాడితో మీటింగ్ అయిందిప్పుడే" అన్నాడు రవీంద్ర.

"ఊహు. అవునా ఏమిటో విశేషం? ఏద యినా కొత్త బాధ్యత నెత్తి నెత్తారా?"

"ఊం. ఓ చిత్రమయినపనే అప్పగిం చారు" అని మొదలుపెట్టి క్లుప్తంగా విష యాన్ని వివరించాడు.

"మరయితే ఇంకేం, మూడు రోజుల్లో పనిముగించి బాస్‌ముందుపెట్టేయి. త్వరగా ప్రమోషన్ ఇచ్చేస్తారు" అంది రమ, చిరు నవ్వుతో.

వారిద్దరి మధ్యా ప్రేమాయణం నాలు గేళ్ళుగా సాగుతోంది. రమ అంటే రవీంద్ర వాళ్ళమ్మకీ ఇష్టమే. రవీంద్రపై రమ ఇంట్లో వాళ్ళకీ సదభిప్రాయమే. అయినప్ప టికీ వాళ్ళ వివాహం వెనక్కే వెళుతోంది.

అందుక్కారణం రవీంద్ర మీదున్న కొన్ని బాధ్యతలు. అతనికి కాలేజీ చదు వుల్లో వున్న తమ్ముళ్ళిద్దరున్నారు. వాళ్ళలో పెద్దవాడి చదువయి ఉద్యోగ మయినా రావాలి. లేదా — తనకి ప్రమో షన్ అయినా రావాలి - అంత వరకూ పెళ్ళి వద్దు అని రవీంద్ర నిర్ణయం. అందుకే ఇలా సినిమా, షికార్ల ఛాన్సులతో సంతృప్తి పడుతోంటారిద్దరూ.

o o o

రవీంద్ర తన పరిశోధన ఇలా మొదలు పెట్టాడు. ఇలాంటి డూప్లికేట్స్ తయారు చేసే కంపెనీలు ఎంత రహస్యంగా వ్యవహా రిస్తుంటాయో అతనికి బాగా తెలుసు. తనె వరో ఏమిటో తెలిసిన ఏ షాప్ వాడూ చచ్చినా తనకి క్లూ ఇవ్వడు. అందుకనే సిటీకి బాగా దూరంగా ఉన్న 'అశోక్‌నగర్' ఎక్స్‌టెన్షన్‌లో ఓ ఎలక్ట్రికల్ సామాన్ల షాప్‌కి వెళ్లాడు.

మామూలుగా ఇతను వెళ్ళగానే,

"యస్ సర్. ఏం కావాలండి?" అనడి గాడు సేల్స్‌మన్.

"'ప్రియా' కుక్కర్ గాస్కెట్ ఒకటి వ్వండి"

అతనందించిన ప్లాస్టిక్కవర్ అందుకుని అటూ ఇటూ తిప్పిచూస్తూ,

"ఎంతవుతుందిది?" అన్నాడు.

"పది రూపాయల్సార్"

"అబ్బో పది రూపాయలే, పోయినేడాది తొమ్మిదికే అమ్మారుకదోయ్!"

"నిజమేనండి. కానీ ఈ మధ్యనే ఆర్నె ల్లుగా అన్ని కుక్కర్స్ స్పేర్స్ రేట్లు పెరిగి పోయినాయి. మేమేం చేయగలం సార్" అన్నాడు అటుగా ఓ టేబిల్ ముందు కూచున్న ప్రొప్రయిటర్ వయిపు చూస్తూ.

మరో షెల్‌లోంచి ఇంకో కవర్ పట్టు కొచ్చాడీసారి.

"ఇది చూడండి. కొత్తగా అమ్ము తున్నాం. ప్రియా కుకర్‌కి సరిగ్గా సెట్టవు తుంది. బాగా పనిచేస్తుందని చాలామంది కస్టమర్స్ అన్నారు."

దాన్నందుకుని చూసాడు. దానిమీద ప్రియా అనే పేరే వుంది. కానీ ట్రేడ్ మార్క్‌లో, డిజైనింగ్‌లో తేడా వుంది.


"ఇదెంత?"

"తొమ్మిది రూపాయల్సార్"

"ఒక రూపాయి తక్కువ" అని లెక్క గట్టుకుని, "సరి ఇదే తీసుకుంటాను" అని డబ్బు తీసిచ్చాడు.

అటు తర్వాత ప్రొప్రయిటర్ దగ్గరికి నడిచి, "హలో చూడండి. మీకీ గాస్కెట్స్ డూప్లికేట్స్‌ని సప్లయి చేస్తున్న కంపెనీ ఏదో తెలుసునా?" అడగటంలో ఎంత ఆమాయకత్వం ప్రదర్శించబోయినా, అసలు ప్రశ్నే అనుమానాన్ని రేకెత్తిస్తోంది.

ఆ వివరాలన్నీ మీకెందుకు?— అంటు న్నట్లుగా రవీంద్ర ముఖంలోకి చూసాడు అతను. తన విజిటింగ్ కార్డు తీసి చూపక




# 7

తప్పలేదు.

వెంటనే పక్కలో బాంబు పడ్డవాడిలా ఉలిక్కిపడ్డాడు అతను.

"అయ్యయ్యో సారీ సర్! మీరెవరో ముందు తెలియదు. రండిలా కూర్చోండి" అని కౌంటర్ అవతల క్లోసెట్ లోకి ఆహ్వానించాడు. కూల్ డ్రింక్స్ తెప్పించాడు.

రవీంద్ర వాళ్ళ కంపెనీ పబ్లిసిటీ ఇచ్చే, "డాగర్" ఎలక్ట్రికల్ అప్లైయన్సెస్ డీలర్ ఈ షాపతను. అందుకనే అంత మర్యాద.

మళ్ళీ తన ప్రశ్నని రిపీట్ చేసాడు రవీంద్ర.

"ఇలాంటివి పెద్దగా వివరాలు తెలుసుకునే ప్రయత్నం మేమూ చెయ్యం సార్. అయినా అడుగుతున్నది మీరు గనక చెపుతున్నాను. లక్ష్మి మార్కెటింగ్ కంపెనీ అనే ఒక చిన్న సంస్థ ఉంది. నెలకోసారి వాన్ వస్తుంది. విచారించకొని మాకు కావలసిన గాస్కెట్స్ ఇచ్చి వెళుతుంటారు"

అడ్రస్ చెప్పమని అడగలేదు రవీంద్ర. నిజంగా అలాంటి కంపెనీ ఒకటున్నట్లయితే టెలిఫోన్ డైరెక్టరీలో చూస్తే తెలిసిపోతుంది ఎడ్రస్.

షాప్ నించి బయటికొచ్చిన వెంటనే ఆపనే చేసాడు. అయితే మొదటి షాపులో దొరికిన ఇన్ఫర్మేషన్ ఎంత వరకు నిజమో ముందుగా వెరిఫై చేసుకోవాలి అనుకున్నాడు.

దాదాపుగా అక్కడుపయోగించిన పద్ధతిలోనే నాలుగయిదు షాపుల్లో విచారించాడు (ప్రతి షాపులో గాస్కెట్ కొనలేదు). అన్ని చోట్ల లక్ష్మి మార్కెటింగ్ కం. పేరే లభించింది.

ఆ రోజుకి విచారణ విరమించి ఆఫీసుకి వెళ్ళిపోయాడు. మరురోజు ఉదయం చూడాల్సిన అర్జెంట్ వర్క్ అవటానికే మధ్యాహ్నం అయిపోయింది. అప్పుడు బయలు దేరాడు రాజేంద్రనగర్ కి.

బాగా చివర్లో ఓ పెద్ద కాంపౌండ్‌లో రెండు గోడౌన్లు, చిన్న ఆఫీసు బిల్డింగ్ కనిపించాయి. తన విజిటింగ్ కార్డుపయోగించి నేరుగా ప్రొప్రయిటర్‌ని చూడబోయాడు.

మెల్లిగా అసలు విషయం బయట పెట్టాడు.

అతను కొద్దిగా ఉలిక్కి పడటం, రవీంద్రకి తెలుస్తోనే వుంది. వెనువెంటనే ఉలికిపాటుని కప్పిపుచ్చు కుంటూ, "మీకెవరో రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చారు. మా కంపెనీ ఓపెన్ చేసి పదేళ్ళయింది. ఇంతదాకా టాయిలెట్ సామాను తప్ప, వేరేవస్తువుని మేం మార్కెటింగ్ చేయనేలేదు," అన్నాడు.

డెడ్ ఎండ్‌ని చేరినట్లయింది రవీంద్రకి. అవతలి వ్యక్తి బుకాయింపు తెలుస్తోనే ఉంది. నేరుగా వెళ్ళి గోడౌన్స్ అన్నీ ప్రతీ అంగుళం వెతికేద్దామా అన్నంత కోపం వచ్చింది. చేసేదేం లేక బయల్దేరాడు.

స్కూటర్ స్టార్ట్ చేయబోతుండగా అంత దూరంలో పార్క్ చేసిన ఓ వాన్ పక్కన డ్రైవర్ కాబోలు కూర్చుని సిగరెట్ తాగుతున్నాడు.

అతన్ని చూడగానే ఓ అయిడియా తట్టింది. "సరే ఇదీ ప్రయత్నిద్దాం" అనుకొని, అతన్నిలా రమ్మని సైగచేశాడు.

మౌనంగా గేట్ దాటేవరకూ నడిచి, "చూడబ్బాయి, నేనొకటి అడుగుతాను. సరిగ్గా సమాధానం చెప్పేవంటే ఇది నీదే" అంటూ చేతిలో పది నోటు చూపించాడు.

అతను వింతగా నోటు వయిపు చూస్తూ తల ఊపేడు.

"అబద్ధం చెబితే పట్టియ్యగలను" అన్నాడు బెదిరిస్తున్నట్లుగా, "నోటు అందదు" అనే అర్థం వచ్చేలా.

ఆ డ్రైవర్‌కిది మరీ విచిత్రంగా ఉంది. "ఇతనెవర్రా, జవాబు తెలిసీ, ప్రశ్న వేస్తాను, డబ్బిస్తాను-అంటున్నాడు" అనుకున్నాడు.

"అడగండి సార్, అబద్ధం చెప్పే అలవాటు లేదు"

"నువ్ సిడ్యూటీలో ఏరోజుల్లో ఏ కంపెనీలకి వెళుతుంటావో చెప్పాలి"

"ఎక్కువగా షాప్ డెలివరీకి పోతానండి. ప్రతి సోమవారం, మంగళవారం మాత్రం రమోలా టాల్కం పవుడర్ ఫేక్టరీకి. శనివారాలు "ప్రియా ప్రెషర్ కుకర్స్" గోడౌన్స్‌కి వెళుతుంటాను సార్"


సమాధానానికి అదిరిపోయాడు రవీంద్ర. అయినా ఆశ్చర్యాన్ని కనిపించనీయకుండా, "మామూలుగా "ప్రియా" కంపెనీ నించీ ఏం లోడ్ చేసుకొస్తుంటావోయ్" అడిగాడు.

"నాకు తెలీదుసార్. ఆ పేకింగ్స్ కొంచం వింతగా ఉంటాయి. అంత పెద్ద కంపెనీ వారి పేరుగానీ, వస్తువు పేరుగానీ, ఇతర వివరాలు గానీ ఏమీ వుండవు వాటిమీద. అయినా అవన్నీ మాకెందుకు సార్. చెప్పిన పని చేసుకుపోతుండటం వరకే తెలుసు"

మౌనంగా రవీంద్ర అందించిన నోటు అందుకొని వెనుదిరిగాడా డ్రైవరు. "ఏమిటిది చిత్రంగా ఉందే. తాము తయారు చేసే వస్తువుకి, తామే డూప్లికేట్ తయారు చేసే అవసరం ఏమిటి "ప్రియా" కంపెనీకి. ఈ డ్రైవర్‌కి నేనెవర్నైనదీ తెలీదు కద. అబద్ధం ఎందుకు చెబుతాడు. ఇందులో నిజమెంతుందో ఎలా కనుక్కోవాలి?" అని ఆలోచనలో పడిపోయి అలాగే నిలుచున్నాడు కాస్సేపు.

ఆలస్యం అవటం తెలుస్తోంటే టయిం చూసాడు. రెండు గంటలయింది. భోజనం గుర్తొచ్చి స్కూటరెక్కాడు.

సాయంత్రం, వాళ్ళింటి దగ్గిర రమని పికప్ చేసుకుని బిర్లా మందిర్‌కి బయలుదేరాడు. దేవుడికి దండం పెట్టుకుని, కొబ్బరి ముక్కలు నవుల్తూ, మెట్లమీదో పక్కగా కూచున్నారు.




టాంక్ బండ్ మీద లయిట్లనీ, ట్రాఫిక్ నీ హుసేన్ సాగర్ నీ చూస్తూ మాటలు చెప్పుకున్నారు. పొద్దున జరిగిందంతా వివరించాడు రవీంద్ర క్లుప్తంగా. రమ సిక్త్స్ సెన్స్ మీద రవీంద్రకి మంచి నమ్మకం. తన బుర్ర పని చేయటానికి మొరాయించినప్పుడామెని సలహాలు అడగటం మామూలే.

రమ కాస్సేపు ఆలోచించి, "నాకో ఐస్ క్రీమ్ ఇప్పిస్తే, నీకు సలహా చెబుతాను" అన్నది చిన్న పిల్లలాగా.

"ఓస్ అంతేగద. ముందు సలహా ఇచ్చేయి మళ్ళీ అయిస్ క్రీం"

"ఈ ప్రియా కంపెనీ గాస్కెట్సు తయారు చేసే రబ్బరు ఒక ప్రత్యేకమయిన కెమికల్ ఉందనీ, వల్కనైజేషన్ లోనే ఒక ప్రత్యేకమయిన పద్ధతిని ఉపయోగిస్తారనీ, నువ్వే ఒకసారెప్పుడో చెప్పేవు. ఈ డూప్లికేటు గాస్కెటు ఎలాగూ కొన్నావు గదా. ఒక ముక్క కట్ చేసి ఏ ఎనలిటికల్ లాబ్ కో పంపితే, వివరాలు తెలుస్తాయి."

ఇంత చిన్న విషయం నాకెలా తట్టలేదా అని ఆశ్చర్యపోయాడు రవీంద్ర.

ఆమె పసింట్లసబాసిలా, "ఎంత పెద్ద ఉద్యోగమయితేనేం, సైన్స్ చదివిన వాళ్ళలా మీ ఆర్ట్స్ వాళ్ళ బుర్ర ఎక్కడ పనిచేస్తుందిలే" అన్నది మెల్లిగా.

ఆ మాటలతో అంతవరకూ టెన్స్ గా వున్న రవీంద్ర మనసు తేలికయింది. "ఏ రమా! మాటలు జాగ్రత్త. నీ పని పట్టిస్తాను," అంటూ ఆమె బుగ్గలు రెండూపట్టి సాగతీస్తూ, చిన్నగా కన్ను కొట్టాడు.

o o o

మళ్ళీ మేనేజర్ గారింటికి వెళ్ళారు రవీంద్ర. ఈ సారి స్వీటు, కారం, కాఫీ అయేదాకా అసలు విషయానికి రాలేదు శివరామ్ గారు.

"ఇప్పుడు చెప్పవోయ్. ఇంతకూ నీ పరిశోధ నేమయింది?"

"ఎస్సర్, ఆ డూప్లికేట్స్ ని తయారు చేస్తున్నదీ, 'ప్రియా' ప్రెషర్ కుకర్స్ కం. వారేనండి"

"వాట్ .... ఏమిటి నువ్వంటున్నది. వాళ్ళకేం పని డూప్లికేట్సు తయారు చెయటానికి. నాతో జోక్ చేస్తున్నావా?" తీవ్రంగా వున్న ఆయన స్వరానికి భయ

పడలేదు రవీంద్ర.

"నా దగ్గర ఆధారాలున్నాయండి" అని మొదట్నించీ తను ట్రక్ డ్రైవరుతో మాట్లాడి వివరాలు రాబట్టిన దాకా, వివరించాడు, ఆయనకి.

"అయితే ఒక మామూలు డ్రైవర్ మాటల్నే ఆధారం అంటావ్?"

"నోనో సర్. డూప్లికేట్ గాస్కెట్ మెటీరియల్, అనాలిసిస్ కూడా చేయించాను. మన ఫైల్లో వున్న అసలు వస్తువుల వివరాలకి టాలీ అవుతున్నాయి. ముఖ్యంగా "ప్రియా" జర్మనీనుంచి స్పెషల్‌గా దిగుమతి చేసుకునే స్టైయిరీన్ అనే పదార్థం కూడా ఇందులో వుంది. అదింకెవరికీ దొరికే అవకాశం లేదుకదా. డిజైనింగ్, వల్కనైజేషన్ అంతా ఒకే విధంగా వున్నాయి.

శివరామ్ గారి నోట మాట రాలేదు కాస్సేపు.

"ఇలా ఎందుకు జరుగుతున్నదనుకుంటున్నావోయ్. ఇది చాలా ఫూలిష్‌గా కన్పించటం లేదూ?"

"మన దగ్గరున్న "ప్రియా" కంపెనీ స్టాటిస్టిక్స్ ఓ మూడేళ్ళవి కొంతవరకూ, పరిశీలించి, కొన్ని వివరాలు తెలుసుకున్నాను సర్"

"మార్కెట్‌లో ఈ మధ్యలో చాలా రకాల కుకర్స్ వస్తున్నాయి. అన్నిట్లోకీ మొదటినించీ మంచి పేరూ, హెచ్చు ఖరీదు రెండూ "ప్రియా" కుకర్‌కే. స్పేర్ పార్ట్స్ విషయంలోనూ అంతే. అందులోనూ కుకర్ ఉపయోగించే ప్రతీ ఒక్కరూ, అప్పుడప్పుడూ కొని తీరాల్సిన స్పేర్ గాస్కెట్. దీని ఖరీదిప్పటికి పది రూపాయలు పెరిగింది. ఈ కారణంగానేమో, "ప్రియా" కుకర్ సేల్స్‌లోనే ఈ మూడేళ్ళలో చెప్పుకోతగ్గ అభివృద్ధి కన్పించటం లేదు. అందుకని గాస్కెట్ ఖరీదు హఠాత్తుగా తగ్గించేస్తే కంపెనీ ప్రిస్టేజికే భంగం కదా! ఒకప్పుడు ఆ సలహానిచ్చిందీ మనమే!

"ఇలాంటి పరిస్థితిలో, ఏ పేరులేని ఫేక్టరీయో, డూప్లికేట్స్ తయారు చేసి, అమ్ముకున్నా ఆశ్చర్యం లేదు. అందుకని ఆ పని తామే చేస్తే ఏం అని, మామూలుగా తమ ఫేక్టరీలో తయారయిన వాటిలోనే, కొన్నిటిని వేరుగా పేక్ చేసి, తక్కువ ధరకి అమ్ముతున్నారు (డూప్లికేట్స్‌గా) అనిపిస్తుంది దిసీస్ వాట్ అయిఫెల్ట్ సర్" అని ముగించాడు.

అక్కడినించీ అతను వెళ్ళిన కాస్సేపటికే శివరామ్ కార్నడ్ గారు, "ప్రియా" ప్రెషర్స్ కుకర్స్ కంపెనీ, జనరల్ మేనేజర్‌తో మాట్లేడేరనీ, వారిద్దరి మధ్యా ఫోన్లో సంభాషణ చాలాసేపే జరిగిందనీ రవీంద్రకి తెలీదు.

ం ం ం

స్కూటర్ పార్క్ చేసి, రమ వెంట ఇందిరా పార్క్ కేసి నడుస్తూ, అన్నాడు రవీంద్ర. "ఈ రోజు నువ్వేం అడిగినా సరే రెడీ. అయామ్ వెరీ హేపీ టుడే" అన్నాడు.

"తెలుస్తోనే ఉంది సంతోషం. మాటల్లో వేరే చెప్పాలా?" అన్నది రమ తాను చిన్నగా నవ్వుతూ.

"ఇంతకీ విశేషమేమిటి? మీరు పడిన కష్టానికి మెచ్చి, ఓ వందేమయినా ఇంక్రిమెంటిచ్చారా?"


"హు వందేంఖర్మ. ఇప్పట్నించీ రెండింతలు వస్తుంది జీతం. నువ్వింక వృద్ధ కన్యగా వుండి పోతానని బెంగ పెట్టుకోనక్కర్లేదు. మీ వాళ్ళకి చెప్పేయి, ముహూర్తాలు చూడమని"

"అబ్బో, వ్యవహారం జోరులో ఉందే......"

ఇద్దరూ పచ్చని పచ్చికలో కూర్చున్న తర్వాతన్నాడు రవీంద్ర, "ఇవాళ్టితో సరి డీలక్స్ పబ్లిసిటీ ఎసోసియేట్స్‌లో మన ఉద్యోగం"

"అదేం .... ఇప్పుడేగా ప్రమోషన్ అన్నావు....గాభరాగా అడిగింది రమ.

"పూర్తి చెప్పనిస్తేగా, మన దృష్టిలో ప్రమోషన్ క్రిందే లెక్క. అయితే కంపెనీ




మారుతోంది. అంతే. ఓ వారంలోగా 'ప్రియా' ప్రెషర్ కుకర్స్, రీజినల్ సేల్స్ ఆఫీస్ మేనేజర్‌గా, కర్నూలు వెళ్ళి చేరాలి"

"నిజం! నువ్వు చెబుతోంది నిజమా"

"మనిద్దరం ఇలా ఎదురెదురుగా కూచోని కబుర్లు చెప్పుకుంటున్నంత నిజం. చిత్రమేమిటంటే, మా మేనేజర్‌గారే వారికి నన్ను సిఫార్సు చేశారట. ఎపాయింట్‌మెంటు విషయం ఫోన్లో చెబుతూ, 'ప్రియాకుకర్స్', జి. ఎమ్. చెప్పారు"

అయితే స్వంత లాభం లేకుండా నీకి ఉద్యోగ మిచ్చుంటారా వాళ్ళు......నో డౌట్....వారికి మీ తెలివి, ఎఫిషియెన్సీ అన్నీ పూర్తిగా తెలిసే ఉద్యోగం ఇచ్చుండ వచ్చు....బట్ నాకొకటి అనిపిస్తోంది....ఆ కంపెనీ రహస్యం ఒకటి నువ్వు కనిపెట్టావు గదా. అది మీ పెదవిదాటి బయటికి రాకుండా ఉండకానికి మిమ్మల్ని తమ ఉద్యోగిగా చేర్చుకున్నారా అనిపిస్తుంది. కంపెనీలో ఓ బాధ్యతగల ఉద్యోగిగా, ట్రేడ్‌సీక్రెట్స్‌ని కాపాడటం నీ కర్తవ్యంగా మారుతోంది కదా......."

"అవునేమో......." ఆలోచనలో పడిపోయాడు రవీంద్ర.

వీరిద్దరి బుర్రలకి అందని విషయమింకొకటి వుంది. ఈ రహస్యం బయటకి రాకుండా వుండడానికిగాను, ఏటా పబ్లిసిటీకిగాను తామిచ్చే డబ్బుకి, అయిదువేలు హెచ్చు చేయటానికి తామంగీకరిస్తున్నట్లు, 'ప్రియా'కంపెనీ జి. ఎమ్ దేశ్‌పాండేగారు, శివరామ్ కార్నడ్‌కి మాటిచ్చారని మూడో మనిషికి తెలీదు. ★